"పెద్దగా ఏం లేవండి." జవాబు చెప్పాడా క్షురకుడు.

"అదేమిటి? ఊరంతా కోడై కూస్తుంటే నీకు తెలీకపోవడం ఏమిటి? మీ రాజుగారి ఏకైక కూతురు అందాల భరిణటగా? ఆమెతో ఆయన ఒంటిస్థంభం మేడలో రాత్రుళ్ళు గడుపుతున్నారటగా?"

"ఏమోనండి. నా కళ్ళతో చూడకుండా ఏం చెప్తానండి?"

"భలేవాడివే. లోకులనుకునేదేదో చెప్పచ్చుగా?"

"నేను అందరిలాంటివాణ్ణి కానండి. ఇతరుల విషయంలో నిజం తెలీకుండా నింద వేస్తే, వారి పాపాన్ని నా నాలిక అనే చీపురుతో కడిగి, దాన్ని నేను స్వీకరించిన వాణ్ణవుతాను. ఈ సంగతి నా సద్గురువు ఏనాడో నన్ను హెచ్చరించారు కాబట్టి నేను నాకు తెలీని విషయంలో ఏం మాట్లాడను."

"నీ సద్గురువు ఎవరు?" ఆశ్చర్యంగా అడిగాడు రాజు.

"మీ గురువుగారైన లక్ష్మోజీ అన్న రామోజీ." జవాబు చెప్పాడా క్షురకుడు.

## 38. ప్రకృతి చెప్పిన పాఠం

ఓ గ్రామంలో ఓ ధనికుడు ఉన్నాడు. పది తరాలు తినేంత ధనం సంపాయించినా, అతను ఖర్చుకి వెనకాడే పరమ లోభి. బియ్యం డబ్బాకి తాళంవేసి, యింట్లోనివారు ఎంతమందో లెక్కచూసి, అన్నం వండటానికి ఆ ప్రకారం తనే బియ్యం కొలిచి భార్యకి యిచ్చేవాడు.

ఓసారి ఆ వూరికి ఓ స్వాములవారు వచ్చారు. ఆయన చెప్పే పురాణ కాలక్షేపానికి ఆ ధనవంతుడు హాజరయ్యాడు. ఆఖరున అందరూ ఎవరికి తోచింది వారు స్వాములవారికి యిచ్చి వెళ్తుంటే ఈ సంపన్నుడు మాత్రం ఏమీ యివ్వకపోగా, ఆయనకి నమస్కరించి యిలా అడిగాడు.

"నాకు ప్రత్యేకంగా ఏదైనా బోధ చేయండి స్వామీ."

స్వాములవారు అతని వంక తేరిపార చూసి చెప్పారు.

"ఓసారి ఈ గ్రామంలోని చెరువుని, చెట్లని చూస్తూ వాటి గురించి ఆలోచించు."

అది ఖర్చులేని పని కాబట్టి అతడు వెంటనే ఆ చెరువు దగ్గరికి వెళ్ళి చెరువులోని నీటిని, చుట్టుపక్కల చెట్లని, గట్లని చూస్తూ ఆలోచించసాగాడు.

'నీరు పొర్లి పోకుండా చెరువుకు నాలుగు పక్కలా గట్లున్నాయి. చెరువులో నీళ్ళున్నాయి. ఆ నీటిలో చేపలున్నాయి. పశువులు, మనుషులు వచ్చి ఆ నీళ్ళు తాగుతారు. తర్వాత వర్షంవల్ల ఆ చెరువు నిండుతుంది. ఇక చెరువు గురించి ఆలోచించడానికి యింతకంటే ఏముంటుంది? చెట్లు గురించి ఆలోచించడానికి మాత్రం ఏముంది? విత్తనం వృక్షమై పళ్ళు, పూలు యిస్తుంది. వాటిని ప్రజలు కోసుకెళ్ళి వాడుకుంటారు.'

ఆతనికింకో ఆలోచన కలిగింది. పూలు, పళ్ళిచ్చినందుకు చెట్లు, నీళ్ళిచ్చినందుకు చెరువు బదులుగా ఏం తీసుకోవు కదా! అతని ఆలోచన అక్కడనించి వూపందుకుంది.

బదులుగా ఏం తీసుకోకుండానే తన నీటిని అందరికీ ఇస్తున్నందుకేనా వర్షంపడి చెరువు మళ్ళీ, మళ్ళీ నిండుతూంటుంది? అలాగే చెట్లు కూడా బదులుగా ఏం తీసుకోనందుకేనా అవి తిరిగి చిగిర్చి పూలు, పళ్ళు ఏటా యిస్తున్నవి? మనం ఏదైనా ఇతరులకి యిస్తేనేనా, మళ్ళీ మళ్ళీ మనకి తిరిగి లభ్యం అయేది?

ఆ క్షణంలో సంపన్నుడికి ప్రకృతి రహస్యం అర్థమైంది.

ప్రకృతిలో ఏదైనా ఇస్తుంటేనే తిరిగి వస్తూంటుంది.

తను? లోభత్వంతో ఆస్తిని పెంచుకుంటున్నాడు. చెరువు నీరివ్వక పోతే, ఎక్కువకాలం నిల్వ వుండే నీరు ఎలా మురికి అవుతుందో, తన సంపదంతా తన దగ్గరే పేరుకుంటే అలాగే అదీ అశుభ్రం అవుతుంది. తన

తప్పు తెలుసుకున్న ఆ సంపన్నుడు వెంటనే ఆ స్వామి దగ్గరికి వెళ్ళి నమస్కరిస్తూ చెప్పాడు.

"నా కళ్ళు తెరిపించారు స్వామి. ఇవి స్వీకరించండి."

అతనిచ్చిన ఆ బంగారు నాణాలని స్వామి ఆ గ్రామంలోని బిచ్చగాళ్ళకి పంచి వెళ్ళిపోయాడు. త్వరలోనే ఆ సంపన్నుడు దానశీలిగా పేరు పొందాడు.

## 39. శివుడే చెప్పాడు

ఓ కార్తీక పౌర్ణమినాడు ఓ శివభక్తుడు ఓ శివాలయానికి వెళ్ళాడు. తను కాశీ నుంచి తెచ్చిన గంగాజలంతో శివలింగానికి అభిషేకం చేయాలన్న తలంపుతో భక్తుల క్యూలో నిలబడ్డాడు.

కాసేపటికి అతని వంతు వచ్చింది. అయితే పూజారి అతన్ని ఎగాదిగా చూసి చెప్పాడు.

"నీకు గర్భగుడిలోకి ప్రవేశం లేదు."

"ఏం? ఎందుకని?" బిత్తరపోతూ ప్రశ్నించాడా భక్తుడు.

"శివాలయంలోకి పంచె కట్టుకుని తప్ప పేంట్ షర్టలతో రాకూడదని నీకు తెలీదా?" ప్రశ్నించాడా పూజారి.

"ఏమిటి? శివుడే ఈ నియమం ఏర్పరిచాడా?" నమ్మలేనట్లుగా చూస్తూ అడిగాడా భక్తుడు.

"అవును. కావాలంటే నువ్వే ఆ పరమశివుణ్ణి అడిగి తెలుసుకో." వెటకారంగా బదులు చెప్పాడా పూజారి.

"అలాగే. ఆయన్నే అడిగి తెలుసుకుంటాను." కోపంగా వెళ్ళిపోయాడా భక్తుడు.

వారం తర్వాత ఆ భక్తుడు ఆ పూజారికి మార్కెట్లో తారసపడ్డాడు. అతన్ని చూసి చెప్పాడు ఆ పూజారి.